సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
17వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం,4 జూన్ 2024


# కౌంటింగ్ అబ్జర్వర్ల సమక్షంలో రెండో దశ ర్యాండిమైజేషన్ ప్రక్రియ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన సిబ్బంది రెండో దశ ర్యాండిమైజేషన్ ప్రక్రియను సోమవారం కలెక్టరేట్ ఎన్ఐసీ సెంటర్‌లో కాకినాడ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నియమితులైన కౌంటింగ్ అబ్జర్వర్ల సమక్షంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్..జాయింట్ కలెక్టర్, పిఠాపురం రిటర్నింగ్ అధికారి ఎస్.రామ్ సుందర్ రెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే కౌంటింగ్ సూపర్వైజర్స్, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వర్లకు సంబంధించి రెండో దశ ర్యాండమైజేషన్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియతో జూన్ 4న నిర్వహించే కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గంతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయించడం జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో 941 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సిబ్బంది అందరికీ తమకు కేటాయించిన కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కాకినాడ జేఎన్టీయూలో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హెచ్.ఎస్ భావన, డీఆర్వో డా. డి.తిప్పే నాయక్, సీపీవో పి.త్రినాథ్, జిల్లా ఉపాధి శిక్షణ అధికారి జి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.




- అపార్టుమెంటులో ఇంటర్ తరగతులు - ఇరుకు గదులలో చదువులు
- ఫైర్ సేఫ్టీ అనుమతులు లేవు... ప్రమాదాలు జరిగితే ప్రాణాలు హరీ
- ఒక కళాశాల ముసుగులో పలు బ్రాంచ్‌లట...!
- ఇంటర్ బోర్డుకు కన్పించని ఆకాష్ అక్రమాలు
- తప్పించుకోవడానికి కన్పించని ప్రత్యామ్నాయ మార్గాలు
- ఆకాష్‌కు వర్తించని నిబంధనలు
- రెండు సంవత్సరాల ఇంటర్‌కి నాలుగు లక్షల ఫీజులట...!
- ఆకాష్‌లో కనిపించని ఫీజుల డిస్‌ప్లే బోర్డు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాలు
- మొదటి అంతస్థులో రెస్టారెంట్...
నాల్గవ అంతస్తులో స్పా మసాజ్ సెంటర్

# ఆకాష్‌లో ఫీ'జులుం'

అది బహుళ అంతస్తు భవనం.. నివాసం కోసం అంతస్తులుగా నిర్మించారు. ఈ భవనాలకు ఎటువంటి ఫైర్ సేఫ్టీ ఉండదు.. మొదటి అంతస్తులో పెద్ద రెస్టారెంట్. అందులో పదుల సంఖ్యలో గ్యాస్ సిలెండర్లు ఉంటాయి. ప్రమాదం జరిగితే ప్రాణాలు పోవాల్సిందే. నాల్గోవ అంతస్తులో అక్రమ స్పా సెంటర్ నడుస్తుంది. ఇదా ఆకాష్ ఇంటర్ కాలేజీ ఉన్న వాతావరణం. తల్లితండ్రులకు ఇవి కనపడవా.. ఇంటర్ బోర్డు అధికారులకు ఇవి అవసరం లేదా... విద్యార్థులు ఎలా పోయినా పర్వాలేదా... స్పా సెంటర్లలో జరుగుతున్నది ఏమిటి... ఆకాష్ ఇంటర్ కాలేజీ యాజమాన్యం రెండు సంవత్సరాలకు నాలుగు లక్షలు డే స్కాలర్‌కి ఫీజులు క్రింద తీసుకొంటున్నారని చెబుతున్నారు. 8000 స్క్వేర్ ఫీట్ల భవనం ఉంటేనే ఇంటర్ కాలేజీకి అనుమతులు ఇవ్వాలని విద్యార్థి సంఘాలు చెబుతున్నాయి. దీనికి ఎలా ఇచ్చారు.. విద్యార్థులకు ఆటస్థలం ఎక్కడ వుంది.. నాణ్యత గల విద్యాబోధన అందిస్తున్నారా.. ఈ కళాశాలకు ఎవరు అనుమతులు మంజూరు చేశారు.. వీటి వెనుక ఉన్న ప్రజాప్రతినిధులు ఎవరు.. అత్యంత ప్రమాదపు అంచున ఉన్న ఆకాష్ కాలేజీపై నిబంధనలు ఉన్నాయా లేవా.. విద్యార్థుల నుంచి లక్షల్లో ముక్కు పిండి వసూలు చేస్తున్న ఫీ'జులుం'.. ఒక కళాశాల నిర్వహణకు ఉండాల్సిన మార్గదర్శకాలు మచ్చుకైనా ఈ భవనాల్లో కనిపించకపోవడం...పిల్లలు ఆడుకోవడానికి ఆటస్థలం ఉండకపోవడం.. ఇటువంటి భవనాల్లో ఆకాష్ జూనియర్ కళాశాలల నిర్వహణ జరుగుతున్నా నియంత్రించకపోవడం.. ప్రభుత్వ శాఖలు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరుపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో అందించిన క్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం..

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

- మిగతా 2 లో..

## నీతి పద్యాలపై విద్యార్థులకు శిక్షణ



**పెద్దాపురం,మేజర్‌న్యూస్:** పెద్దాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా సోమవారం గ్రంథాలయంలో శిక్షణా శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వాట్సప్ ద్వారా పంపిన నీతి కథలను వినిపించడం జరిగింది. ప్రధానోపాధ్యాయులు టి.సుబ్బారావు విద్యార్థులకు తెలుగు వ్యాకరణంపై వివరించడం జరిగింది. దీనిలో భాగంగా పుస్తక సమీక్ష, పుస్తకాలు చదవడం, స్పోకెన్ ఇంగ్లీష్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు అరవింద్, కొమ్మన అప్పారావు, టి.కామరాజు, సిబ్బంది సింగం బుల్లియ్య, తదితరులు పాల్గొన్నారు.

## భారీ అన్న సమారాధనతో ముగిసిన పెరవలి హనుమాన్ జయంతి ఉత్సవాలు



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి సెంటర్లో 16వ నెంబర్ జాతీయ రహదారి ప్రక్కన ఉన్న అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా 33 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జూన్ 3వ తేదీ సోమవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. సుమారు 6000 మంది పాల్గొన్న ఈ అన్న సమారాధన కార్యక్రమానికి పరిసర గ్రామాల నుండి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈరోజుతో ఈ జయంతోత్సవాలు ముగిసినవి అని ఆలయ కమిటీ సభ్యులు సలాది కృష్ణమూర్తి తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మాణిక్ రెడ్డి మురళీకృష్ణ, నాగిరెడ్డి నాగేశ్వరరావు, సలాది శ్రీహరి, సుందర సత్యనారాయణ, తాయి చక్రపాణి, బొడ్డు రామాంజనేయులు, సలాది సాయి, ఆకుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య మహిళ కళాశాలలో వాలంటీర్లచే ప్రపంచ సైకిల్ దినోత్సవం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక శాంతి నగర్‌లో ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా సోమవారం కళాశాల ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లచే ర్యాలీ నిర్వహించారని కళాశాల ప్రిన్సిపల్ కె.కరుణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.ఇ.వి.ఎల్ నాయుడు మాట్లాడుతూ సైకిల్ వినియోగించడం వలన అనేక లాభాలున్నాయని, శారీరక ధృడత్వం, సరైన ఆరోగ్యం, పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని, ఎక్కువ వెహికల్స్ వాడటం వలన హనికరమైన పదార్థాలు గాలిలో ఎక్కువగా ఉంటున్నాయని, దీని వలన మనిషి ఆరోగ్యం రోజురోజుకు క్షీణించిపోతుందని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ కె.కరుణ మాట్లాడుతూ సైక్లింగ్ అనేది ఎంతో ఆర్యోగకరమైనది మరియు ఆహ్లాదకరమైనదని, మానసికంగా, శారీరకంగా ఇది మంచి వ్యాయామం అని, రోగనిరోధక శక్తి పెరగడంలో ఉపయోగపడుతుందని, పెట్రోల్ ఉపయోగించరు కాబట్టి పర్యావరణాన్ని కాపాడినవారమవుతామని, వీలున్నంత వరకు సైకిల్ వినియోగాన్ని పెంచుకోవాలని తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.నాగశ్రీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం పర్యావరణాన్ని రక్షించడంలో ప్రధానమైన పాత్రను పోషిస్తుందని, పెట్రోలు వంటి ఇంధనాలను తగ్గించి వాడటంలో సహాయపడుతుందని అలానే చక్కని ఆరోగ్యాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఎన్.ఎస్.ఎస్. కార్యనిర్వహణాధికారులు పి.బి.టి. సురేఖ, కె.వంశీ మరియు వ్యాయామ ఉపాధ్యాయురాలు పి.సత్యవతి, అధిక సంఖ్యలో వాలంటీర్లు పాల్గొన్నారు.

## చెరువుకొమ్ముపాలెంలో పోలీస్ చెక్పోస్ట్ ఏర్పాటు

-ఎస్సై రఘునాథరావు




**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మంగళవారం రంపచోడవరంలో నిర్వహించనున్న అసెంబ్లీ కౌంటింగ్‌నకు మండలం నుండి వెళ్లనున్న అభ్యర్థులను జడ్డంగి స్టేషన్ పరిధిలోని చెరువుకొమ్ముపాలెంలో ప్రత్యేక చెక్పోస్ట్‌ను ఏర్పాటు చేసి కౌంటింగ్ పాసులు ఉన్న వ్యక్తులను మాత్రమే పంపించడం జరుగుతుందని జడ్డంగి ఎస్సై రఘునాథరావు తెలిపారు. కౌంటింగ్ పాసులు లేని వ్యక్తులను వెనక్కి పంపించడం జరుగుతుందని నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో స్థానిక సీఐ సన్యాసినాయుడు సూచనలతో పోలీస్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేసినట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు.

## జిల్లాస్థాయి కరాటే పోటీలలో సత్తా చాటిన ఆత్రేయపురం విద్యార్థులు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మదర్ థెరీసా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ రావులపాలెం ఆధ్వర్యంలో జరిగిన కరాటే పోటీలో ఆత్రేయపురంకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆత్రేయపురం గ్రామానికి చెందిన టైక్వాండో కరాటే విద్యార్థులు ఎల్లో బెల్ట్ నాన్ చాక్ కటాస్ ఏ భాగంలో తోటకూర నయన్ వర్మకు గోల్డ్ మెడల్, ఫైటింగ్ విభాగంలో సిల్వర్ మెడల్ పొందారు. జూనియర్ వైట్ బెల్ట్ కటాస్ ఏ భాగంలో పాలపర్తి దీక్షిత రాజ్‌కు బ్రాంజ్ మెడల్, ఫైటింగ్ బి విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు కోచ్ టి.లక్ష్మీ సందీప్ కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా రావులపాలెంలో మదర్ తెరెసా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టారు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రూ.14.86 లక్షలు శ్రీశ్రీ నూకాలమ్మ అమ్మవారి హుండీల ఆదాయం



**పెద్దాపురం, రూరల్, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండలం, కాండ్రకోట గ్రామంలో వేం చేసియున్న శ్రీశ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవస్థానం నందు సోమవారం ఉదయం 9 గంటలకు హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవదాయ శాఖ అధికారులు ఇన్‌స్పెక్టర్ వాడ్రేవు సురేష్ కుమార్, మహారాణి సత్రం కార్యనిర్వాహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్‌లు పాల్గొన్నారని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి తలాటం వెంకట సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఇఓ తెలుపుతూ అమ్మవార్కి జారతలో 37 రోజులకు గాను రూ.14,86,286/- ల ఆదాయం సమకూరిందని తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది మోహన్, కామరాజు, స్వచ్ఛంద సంస్థ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

- సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.దొరరాజు



రామచంద్రాపురం, మేజర్ న్యూస్ : మంగళవారం 4వ తేదీన పార్లమెంట్ మరియు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సందర్భంగా సెక్షన్ 144 సిఆర్‌పిసి మరియు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ మరియు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నలుగురు లేదా అంతకంటే ఎక్కువమంది గుంపుగా ఒకచోట ఉండకూడదని, అభ్యర్థులు మరియు ఆర్.ఓ. ధ్రువీకరించిన కౌంటింగ్ ఏజెంట్ లు తప్ప ఇతరులు ఎవ్వరు కూడా ఎలక్షన్ కౌంటింగ్ ప్రదేశానికి వెళ్ళరాదని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి. దొరరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజం, ప్రజాతీర్పు ను ప్రతి ఒక్కరూ గౌరవించవలెనని, గెలిచినా, ఓడినా భావోద్వేగాలకు లోను కాకుండా సంయమనం పాటించాలని , రెచ్చగొట్టే పనులు చేయకుండా సంయమనం పాటిస్తూ గెలుపు ఓటమిలను హుందాగా తీసుకోవాలని, ఎటువంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, ముఖ్యంగా మోటార్ సైకిల్ సైలెన్సర్లు తీసి నడపడం, బైక్ ర్యాలీలు చేయడం, బాణసంచా కాల్చడం వంటివి చేయకూడదని, గొడవలలో పాల్గొనడం గాని, గొడవలు ప్రోత్సహించడంగాని చేయరాదని, గ్రామంలోని గ్రామ పెద్దలు, కుల పెద్దలు, పార్టీ పెద్దలు గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించే ఎటువంటి చర్యలు జరగకుండా భాద్యత తీసుకొని తగు జాగ్రత్త వహించాలని సిఐ దొరరాజు అన్నారు. ఎవరైనా ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని శాంతి భద్రతలకు విఘాతం కల్గించే చర్యలకు పాల్పడితే వారిపైన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుం దన్నారు. సోషల "మీడియా లోఎవరైనా ఎదుటివారిని రెచ్చగొట్టే విధంగా మెసేజ్‌లు పెట్టడంగానీ, స్టేటస్‌లు పెట్టడంగానీ, ప్రజాశాంతికి భంగం కలిగించే మరేవిధమైన మెసేజ్‌లు, వ్యాఖ్యలు చేసినావారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా యువత ఎలక్షన్ కేసుల్లో ఇరుక్కుని వారి బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని, పై విషయాలను ప్రజలందరూ గమనించి జాగ్రత్త వహించాలని పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ పోలీస్ పి.దొరరాజు కోరారు.

# ఓట్ల లెక్కింపుకు సర్వం సిద్ధం

- గట్టి పోలీసు బందోబస్తు

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** 53 రంపచోడవరం ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పార్లమెంటుకు, అసెంబ్లీకి వేరువేరుగా ఓట్ల లెక్కింపుకు సర్వం సిద్ధం చేయడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం గిరిజన సంక్షేమశాఖ గురుకుల బాలికల జూనియర్ కాలేజీ, హాస్టల్లో ఏర్పాటు చేసిన రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన అసెంబ్లీకి, పార్లమెంటుకు వేరువేరుగా ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, రంపచోడవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, రంపచోడవరం అడిషనల్ ఎస్పీ జగదీష్ వేరువేరుగా కౌంటింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గానోరే మాట్లాడుతూ రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన అసెంబ్లీకి పార్లమెంట్‌కు వేరువేరుగా కౌంటింగ్‌కు పూర్తిస్థాయిలో సిద్ధం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం యస్.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రాలలో ప్రతిష్టాత్మకమైన భద్రత వలయంలో ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అదేవిధంగా అసెంబ్లీకి 20, పార్లమెంటుకు 20 టేబుల్స్ వేరువేరుగా ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఎన్నికల కౌంటింగ్‌కు ఐడెంటి కార్డులు ఉన్నవారిని లోపలికి అనుమతించడం జరుగుతుందని అదేవిధంగా ఇతరులను ఎట్టి



పరిస్థితుల్లోనూ లోపలికి అనుమతి ఇంచబోమని ఆయన తెలిపారు. కౌంటింగ్ విధులకు హాజరయే సిబ్బంది అధికారులు ఐడెంటి కార్డులు తీసుకొని లోపలికి రావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్లు, డిప్యూటీ తాసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

**ఓట్లు లెక్కింపుకు గట్టి భద్రత ..** రంపచోడవరంలో మంగళవారం జరగనున్న ఓట్లు లెక్కింపు సందర్భంగా పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా ఆధ్వర్యంలో రంపచోడవరం అడిషనల్ ఎస్పి జగదీష్ అడహళ్లి పర్యవేక్షణలో సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్సైలు సీఐలు పోలీసులు తో గట్టి భద్రత చర్యలు తీసుకున్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా దేవిపట్నం రూట్‌లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. అలాగే ముఖ్యమైన ప్రాంతాల్లో పోలీసులు గస్తీ ఏర్పాటు చేశారు.

## రానున్న రెండు రోజులు జిల్లాలో 144 (2) సీఆర్ పిసి అమలు

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** సార్వత్రిక ఎన్నికలు 2024 ఓట్ల లెక్కింపు నేపధ్యంలో సెక్షన్ 144(2) %జతీ్రా.జ% కింద నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు సమావేశాన్ని నిషేధిస్తూ మరియు అన్ని వివరణలు, అగ్నిమాపక ఆయుధాలు లేదా కర్రలను తీసుకెళ్లడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తూ జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా కె. మాధవీలత సోమవారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. కర్రలు, ఆయుధాలు, రాళ్లు మొదలైనవి, మొత్తం తూర్పుగోదావరి జిల్లా అధికార పరిధిలో తీసుకెళ్లడాన్ని నిషేధించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వు 03.06.2024 నుండి 05.06.2024 వరకు తూర్పుగోదావరి జిల్లా అంతటా అమలులో ఉంటుందనీ జిల్లా కలెక్టర్ తెలియ చేశారు.

## బాలికలు మనోధైర్యంతో పాటు ఆత్మరక్షణ పెంపొందించుకోవాలి



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** బాలికలు మనోధైర్యంతోపాటు ఆత్మ రక్షణకు సంబందించన కళలలో నైపుణ్యం పెంపొందించుకోవాలని డ్రాగనఫ్ ఇన్స్యూట్యూట్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ మాస్టారు శిడగం శ్రీనివాసరావు విద్యార్థినులకు సూచించారు. సోమవారం ఏలేశ్వరం గ్రంధాలయంలో వేసవి శిక్షణలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక తరగతులకు ఆయన పాల్గొని బాలికలకు తగు సూచనలు అందించారు. ఈసంధర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు బాలికలపై జరుతున్న అత్యాచారను సమర్ధవంతంగా ఎదుర్కోనేందుకు నేటి బాలికలు మనోధైర్యంతో పాటు ఆత్యరక్షణకు కరాటే వంటి విధ్యలలో శిక్షణ పొందాలన్నారు. అనంతరం బాలికలకు కరాటేలో మెలకువలను నేర్పారు. ఈ కార్యక్రమం గ్రంధాదిపతి కవికొండల సత్యనారయణ ఆధ్వవర్యంలో జరిగింది.

# సర్వం విష్ణుమయం జగత్ - చాగంటి







**కాకినాడ, మేజర్ న్యూస్ :** విష్ణు తత్వాన్ని అర్థం చేసుకొని నిజజీవితంలో వాటిని ఆచరించడం ద్వారా భగవంతుని యొక్క కృపాకటాక్షాలను పొందగలమని ప్రవచన బ్రహ్మ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక భవానీ సమేత నీలకంఠేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణములో ఉన్న శ్రీ వాగ్గేయకార మండపం ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా అమెరికాకు చెందిన యండూరు నాగదీపక్ పది లక్షల రూపాయలు ఆర్థిక సహకారంతో నిర్మించిన ముఖమండపాన్ని చాగంటి కోటేశ్వరరావు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం శ్రీ వాగ్గేయకార మండపంలో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి వేంకటేశ్వరస్వామివార్లకు నూతన ఆభరణాలను చాగంటి కోటేశ్వరరావు చేతుల మీదుగా సమర్పించగా వాటిని వేంకటేశ్వర స్వామి పద్మావతి అమ్మవార్లకు అలంకరింప చేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ సంగీత విధ్వంసురాలు పెద్దాడ సూర్య కుమారి ఆధ్వర్యంలో ఇంతటి విశేష కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయం అని కొనియాడారు. శిష్యుల సహకారంతో అద్భుతమైన మండపాన్ని నిర్మించి సంగీత మరియు భక్తి సంబంధమైన కార్యక్రమాల నిర్వహణకు ఎటువంటి అవాంతరము లేకుండా చేయడం అంటే నిత్యము భగవంతున్ని సేవించడం లాంటిదేనని ఆయన అన్నారు. మా సోదరి శ్రీమతి పెద్దాడ సూర్యకుమారి ఆధ్వర్యంలో ఇంతటి వైభవం కలిగిన సందర్భములో తననుభాగస్వామ్యం చేయడం ఆనందాన్ని కలిగిస్తోందని చాగంటి నమస్కారపూర్వకంగాకృతజ్ఞతలుతెలుపుకున్నారు. దేవతా మూర్తులకు ఆభరణాలుసమర్పించి వాటి ద్వారా మనం భగవంతుని యొక్క కొత్త అందాలను దర్శించుకుంటూ ఉంటామని చెప్పారు. అయితే ఈ ఆభరణాలను భూషణాలుగా ప్రస్తావిస్తూ ఇందులోని భగవత్ తత్వాన్ని విశ్లేషించిన అంశాలతో భక్తులందరూ ఆనంద పరవశ్యంలో మునిగిపోయారు. విష్ణు తత్వం మరొకటి లేదని వాసుదేవమయం అనేక అంశాలను వివరిస్తూ వైజయంతిమాలలో నిక్షిప్తమైన విషయాలను వివరిస్తూ పంచభూతాలకు ప్రతిరూపంగా మణులను వివరించిన తీరు అద్భుతం. భగవంతుడు మన నుండి రెండే రెండు భూషణలను అపేక్షిస్తూ ఉంటాడని అవి వాక్ భూషణం మరియు క్షమా భూషణం (ఓర్పు) ఉన్న వ్యక్తులను భగవంతుడు నిత్యము రక్షిస్తూ ఉంటాడని చెప్పారు. ఏకాదశి పర్వదినం నాడు ఇంతటి విశేష కార్యక్రమాన్ని నిర్వహించడం అందునా వేంకటేశ్వరస్వామికి ఆభరణ సమర్పణ తన చేత చేయించడం పట్ల ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకున్నారు. అంతర్జాతీయ సంగీతవిద్వాంశురాలు పెద్దాడ సూర్యకుమారి మాట్లాడుతూ వాగ్గేయకార మండపాన్ని మరింతగా సుందరంగా తీర్చిదిద్దడానికి అమెరికాకు చెందిన యండూరు నాగ దీపక్ ఆర్థిక సహకారంతో ముఖ మండపాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని నా సంగీత శిష్యురాలైన వారి బంధువులు ఈ బృహత్ కార్యక్రమానికి సహకరించడం పట్ల ధన్యవాదాలు తెలుపుకున్నారు. త్వరలో ముఖ మండపం ప్రాంతమంతా ప్రత్యేక టైల్స్ వేయాలన్న ఆలోచన ఉందని దాతలు కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. సాక్షాత్ భగవత్ స్వరూపంగా తామంతా భావించే చాగంటి కోటేశ్వరరావు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగడం మా అందరి అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. కార్యక్రమానంతరం చాగంటి కోటేశ్వరరావును పెద్దాడ రామచంద్రరావు సూర్యకుమారి దంపతులు నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించగా, ఇంతటి వైభవానికి ప్రధానవ్యక్తులైన పెద్దాడరామచంద్రరావు సూర్య కుమారి దంపతులను భక్తులు వెంకటేశ్వరరావు దంపతులు నూతన వస్త్రాలతో సత్కరించి ఆశీస్సులు పొందారు. పవిత్రమైన ఏకాదశి రోజున స్వామివారికి ఆభరణాలు సమర్పణతో పాటు ముఖమండపం ప్రారంభోత్సవంలోనూ అందరినీ భాగస్వామ్యం చేయడం పట్ల భక్తులు హర్షాతి రేఖాలతో వారి అభిమానాన్ని ప్రకటించుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్ణకుంభంతో చాగంటి కోటేశ్వరరావుకు నాగేంద్ర శర్మ, ఫణీంద్ర శర్మ, నరసింహ శర్మ, ఫణి శర్మలు స్వాగతం పలికారు.

## కౌంటింగ్ రోజు కార్యకర్తలంతా సమన్వయంతో ఉండాలి

### -జగ్గంపేట వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** కౌంటింగ్ రోజు నాయకులు కార్యకర్తలు సమన్వయంతో ఉండాలని జగ్గంపేట వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. సోమవారం ఆయన ఒక వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ పోలీసు వారి నిబంధనల ప్రకారం కౌంటింగ్ లో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరు పడితే వాళ్లు కౌంటింగ్ దగ్గరకు రాకుండా చూసుకోవాలన్నారు. జగ్గంపేట ఎమ్మెల్యేగా తాను, సీఎంగా జగన్మోహన్ రెడ్డి గెలుపొందుతారన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఏజెంట్లంతా కౌంటింగ్ ను దగ్గర ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పోలీస్ సిబ్బంది, ఎన్నికల అధికారులకు సహకరించాలన్నారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కౌంటింగ్ ముగిసిన తరువాత విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా కాల్పులు నిర్వహించరాదన్నారు. ఎన్నికల సమయంలో ఎటువంటి గొడవలు జరిగిన అవి తీవ్ర తరంగా మారతాయని కాబట్టి ఎవరూ కూడా ఘర్షణలకు దిగి కేసుల్లో ఇరుక్కోవద్దన్నారు. ముఖ్యంగా యువత అంతా కూడా జాగ్రత్తగా ఉండాలని నెగ్గిన తర్వాత కోడ్ ముగిశాక ఏ కార్యక్రమం చేసుకున్న ఇబ్బంది ఉండదని నరసింహం పేర్కొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణపై పోలీసులకు శిక్షణ



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** నేడు ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో జగ్గంపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల పోలీస్ స్టేషన్ల సిబ్బందికి సిఐ లక్ష్మణరావు శిక్షణ ఇచ్చారు. జగ్గంపేట సర్కిల్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో సీఐ లక్ష్మణరావు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని మూడు మండలాల్లోని గ్రామాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉంటూ 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు ఎవరు గుమిగూడకుండా ఉండేలా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాల్లో జల్లెడ పట్టాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు జరగకుండా చూడాలన్నారు. ప్రజలకు ఘర్షణలపై అవగాహన కల్పిస్తూ శాంతిభద్రతలు కాపాడాలన్నారు. ఇప్పటికే సర్కిల్ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలకు సమావేశాలు నిర్వహించడం జరిగిందని ఫలితాలు ముగిశాక విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా కాల్చడం వంటివి జరపరాదని సూచించామన్నారు. ప్రజలంతా పోలీసులకు సహకరించాలని సిఐ లక్ష్మణరావు కోరారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎస్సై నాగార్జున రాజు, కిర్లంపూడి, గండేపల్లి ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## ప్రజలంతా శాంతిభద్రతలు పరిరక్షించాలి

### -జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** ఎన్నికల్లో చివర అంకమైన కౌంటింగ్ దశకు చేరుకున్నామని జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. సోమవారం ఆయన ఒక వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగానెహ్రూ మాట్లాడుతూ పోలీసు నిబంధనలు అతిక్రమించకుండా అందరూ సమైక్యంగా శాంతియుతంగా కౌంటింగ్‌కు సహకరించాలన్నారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉన్నందువల్ల దాన్ని అనుసరించి ఉత్సవాలు చేసుకోవడం, ర్యాలీలు, బాణాసంచా కాల్చడం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఒకే చోట పదిమంది గుమిగూడి ఎదుటివారిని ఇబ్బంది పెట్టే పరిస్థితులు తీసుకురావద్దన్నారు. క్రమశిక్షణతో పోలీసు నిబంధనలకు కట్టుబడి ఉండాలన్నారు. విజయం ఏ వైపు ఉందో ఇప్పటికే అందరికీ అర్థం అయిపోయిందని స్పష్టమైనటువంటి విధానంలో ఉన్నాం కాబట్టి దీనికి విజయోత్సవాలు చేసుకునే అవసరం లేదన్నారు. నిబంధనలు అనుసరించి ఈ నెల 6వ తేదీ దాటిన తర్వాత ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం మనం ఏ కార్యక్రమం చేసుకున్న ఇబ్బంది లేదు కాబట్టి అప్పటివరకు ఓపిక పట్టాలన్నారు. ముఖ్యంగా శాంతి భద్రతలను పరిరక్షించాలని నెహ్రూ కోరారు.

# ఆకాష్‌లో ఫీ'జులుం'

**ఉమ్మడిగోదావరిజిల్లాల సూర్యబ్యూరో :** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో ఆకాష్ యాజమాన్యం నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలల అనుమతులపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.. కాకినాడ నగరంలోని ఆకాష్ జూనియర్ కళాశాల ఉన్న భవనం అక్రమ నిర్మాణంగా చెబుతున్నారు. అంత పెద్ద బహుళ అంతస్తుల కమర్షియల్ భవనానికి ఫైర్ సేఫ్టీ అనుమతులు లేవట... నిబంధనలకు వ్యతిరేకంగా నాల్గవ అంతస్తులో స్పా సెంటర్ నడుపుతున్నారు. ఒక ఇంటర్ కళాశాలకు ఉండాల్సిన మార్గదర్శకాలు, విద్య నేర్పించే ఉపాధ్యాయులు హాస్టల్ నిర్వహణ విధి విధానాలు మచ్చుకైనా కన్పించవు. అయినా ఇంటర్ బోర్డు అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇక్కడ రెస్టారెంటులో అనుకోని ప్రమాదం ఏదైనా జరిగితే బాధ్యులెవరు? ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు ఈ అక్రమాలు కన్పించడం లేదా.. ఈ ప్రాంగణంలో ఎక్కడా ఫైర్ సేఫ్టీ లేదు. బహుళ అంతస్తు భవనం కావడంతో ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలి. కాని ఇక్కడ అటువంటి ఏర్పాట్లు మచ్చుకైనా కన్పించవు. ప్రభుత్వ మార్గదర్శకాలతో ఆకాష్ యాజమాన్యానికి సంబంధం లేదు. ఒక కళాశాల అనుమతి ముసుగులో పలు ప్రాంతాల్లో బ్రాంచ్‌లు నిర్వహిస్తారట.

**అపార్టుమెంట్లలో కళాశాలలు...** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో ఉన్న ఆకాష్ కళాశాలలు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా ఇంటర్ బోర్డు అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. కళాశాలలకు ఇంటర్ బోర్డు అనుబంధ గుర్తింపు ఇస్తుంది. అఫ్లియేషన్ ఇచ్చేటప్పుడు అనేక అంశాలను ఇంటర్ బోర్డు పరిశీలించాల్సి ఉంటుంది. ఆకాష్ కాలేజీకి 8 వేల చదరపు అడుగుల స్థలం ఉండాలి. ఆటస్థలం రెండు ఎకరాల్లో తప్పనిసరి. లేబొరేటరీతో పాటు సెక్షన్‌కు ఇద్దరు అధ్యాపకులుండాలి. 9 సెక్షన్లుకు మించి ఉండకూడదు. ప్రతి సెక్షన్‌లో 88 సీట్లు అనుమతిస్తారు. భవనానికి ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ ఉండాలి. రోడ్లు భవనాల శాక సర్టిఫికెట్ ఉండాలి. కానీ ఆకాష్ కాలేజీ యాజమాన్యం ఈ నిబంధనలు పట్టించుకోవడం లేదు. ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. ప్రాక్టికల్స్ చేయించిన పాపాన పోవడం లేదు. సైన్స్ గ్రూపులతోపాటు ఆర్ట్స్, కామర్స్ గ్రూపులూ ఉండాలి. కానీ ఆకాష్ కాలేజీల్లో అసలీ గ్రూపులే ఉండడం లేదు. కాలేజీల్లో ఎక్కడా కూడా ఆటస్థలం అనేదే ఉండటం లేదు. ఒకచోట పర్మిషన్ ఉంటే మరోచోట చదువులు చెబుతున్నారు. అరకొరగా ఉండే అధ్యాపక సిబ్బంది అతి తక్కువ వేతనాలిస్తూ... ఫీజుల విషయంలో విద్యార్థుల్ని మానసిక ఒత్తిడికి గురిచేస్తూ అమానవీయంగా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. ఈ వ్యవహారంపై ఇంటర్ బోర్డు అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## కౌంటింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- పారదర్శకంగా ఎన్నికల విధులు
- ఏజెంట్లు నిబంధనలు పాటించాలి
- ఆర్వో వెంకటరావు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. స్థానిక జేఎన్‌టీయుకే ఆవరణలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లుకు మూడవ విడత శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా కౌంటింగ్ ప్రక్రియపై సంపూర్ణ అవగాహన కల్పించామని, తీసుకున్న శిక్షణకు అనుగుణంగా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసేవరకు ఎన్నికల సిబ్బంది పాత్రపై సూచనలు ఇచ్చి అవగాహన కల్పించారు. అదే సమయంలో కౌంటింగ్ ఏజెంట్లు కూడా నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఉదయం ఆరు గంటలకల్లా కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్‌తో సహా ఏ వస్తువులను లోపలకు అనుమతించబోమని స్పష్టం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జె.నివాస్ పర్యక్షణలో అవసరమైన అన్ని ఏర్పాట్లును పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఏఆర్వో చల్లన్నదొర, ఎన్నికల డిటిలు నాయుడు, పవన్ తదితరులు పాల్గొన్నారు.


**ఉదయం 8గంటలకు ప్రక్రియ ప్రారంభం :** కౌంటింగ్ ప్రక్రియను ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తామని ఆర్వో జె.వెంకటరావు తెలిపారు. 234 పోలింగ్ స్టేషన్లలో 2,41,620 మంది ఓటర్లకు సంబంధించి 1,74,356 ఓట్లు పోలయ్యాయని చెప్పారు. ఇందులో మహిళలు 90,624 మంది, పురుషులు 83,668 మంది, ఇతరులు 64 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. సుమారు 72.14 శాతం ఓటింగ్ నమోదైందని చెప్పారు. కౌంటింగ్ సందర్భంగా సుమారు 450 మంది విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. కౌంటింగ్ కోసం 14 టేబుల్స్ ఏర్పాటు చేశామని, 15 రౌండ్లు ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. అలాగే సర్వీస్ ఓటర్లు, పోస్టల్ బ్యాలెట్ కోసం మరో 5 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 3,221 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ఆర్వో చెప్పారు. అలాగే హెూం ఓటింగ్ ద్వారా 45 మంది, సర్వీస్ ఓటర్లు 33 మంది ఓట్లు వేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఏఆర్వో చల్లన్నదొర, ఎన్నికల డిటిలు నాయుడు, పవన్ తదితరులు పాల్గొన్నారు

## కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ మాధవీలత



**రాజానగరం, మేజర్ న్యూస్ :** రాజమండ్రీ సీటీ అసెంబ్లి నియోజక వర్గ పరిధిలో కౌంటింగ్ సందర్భంలో ఏర్పాట్లను ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులు ఎమ్ సుబ్రహ్మణ్యంతో కలిసి కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా కె మాధవీలత పరిశీలన చేశారు. సోమవారం స్థానిక నన్నయ్య యూనివర్సిటీ ఆవరణలో రాజమండ్రీ సిటి అసెంబ్లి నియోజక వర్గం పరిధిలో కౌంటింగ్ ఏర్పాట్లు ను మున్సిపల్ కమిషనర్ కే దినేష్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, రాజమండ్రీ అసెంబ్లి నియోజక వర్గం పరిధిలో రాజమండ్రి సిటీ అసెంబ్లి నియోజక వర్గం పరిధిలో ఈవిఎమ్ ద్వారా పోలైన ఓట్లు "ఎన్ బ్లాక్ – ఈస్ట్ వింగ్" లో పార్లమెంటు సిగ్మెంట్ ఈవిఎమ్ ఓట్లు రూం నెంబర్ 317 (14 టేబుల్స్) , అసెంబ్లి సిగ్మెంట్ ఈవిఎమ్ ఓట్లు రూమ్ నంబర్ 320 , 321 లలో (14 టేబుల్స్ ) పోస్టల్ బ్యాలెట్ ఓట్లు రూమ్ 319 లో (6 టేబుల్స్) ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే కౌంటింగ్ అధికారులకి సిబ్బంది రెండు దశల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. రెండు సార్లు ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బందినీ కేటాయించమన్నారు. మంగళవారం ఉదయం 5.30 గంటలకు కౌంటింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ద్వారా టేబుల్స్ కేటాయించనున్నట్లు తెలిపారు. పరిశీలకులు, కలెక్టర్ వెంట నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి కె దినేష్ కుమార్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, తదితరులు హాజరయ్యారు.

## ఓట్ల లెక్కింపులో సమన్వయం పాటించండి



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఈ నెల 4న మంగళవారం కాకినాడ జేఎన్టీయూ ఆవరణలో జరుగనున్నందున ఓట్ల లెక్కింపు లో ఎజెంట్లుగా పాల్గొనే కార్యకర్తలు అప్రమత్తంగా ఉంటూ సమన్వయం పాటించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సూచించారు. సామర్లకోట మండలం హుస్సేన్ పురం గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగాఆయన కార్యకర్తలతో పలు విషయాలు చర్చించారు. ఓట్ల లెక్కింపులో పాల్గొనే ఎజెంట్లు మధ్యలో వెళ్ళిపోకుండా ఆఖరి క్షణం వరకూ ఉండి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఎలాంటి అనుమానాలు వచ్చిన లెక్కింపు కేంద్రం అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే లెక్కింపు కేంద్రాల వద్ద ఎన్నికల కమిషన్ నిభందనలు పాటిస్తూ ఎలాంటి ఇబ్బంది పార్టీ అభ్యర్థి పరంగా రాకుండాజాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే చినరాజప్ప వారికి సూచించారు.

## జూన్ 1 నుంచి 30 వరకు "మలేరియా వ్యతిరేఖ మాసోత్సవాలు"



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** జిల్లాను మలేరియా వ్యాధి రహితంగా ఉంచేందుకు దోమలు నియంత్రణతో పాటు పరిసరాలు పరిశుభ్రతను ప్రతి ఒక్కరు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంటేశ్వరరావు అన్నారు. జూన్ 1 నుంచి 30 వరకు మలేరియా వ్యతిరేఖ మాసోత్సవాలు నిర్వహించనున్న సందర్భంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజల్లో మలేరియా నియంత్రణ పై విస్తృత అవగాహన కలిగించే విధంగా ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

రానున్న వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి సంవత్సరం జరుపుతున్నట్టుగానే ఈ సంవత్సరం కూడా తూర్పు గోదావరి జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేఖ మాసోత్సవాలు కార్యక్రమాన్ని ప్రారంభించించడం జరుగుతుందన్నారు. ప్రతి పీ హెచ్ సి, సబ్ సెంటర్, విలేజ్ వార్డ్ సచివాలయంపరిధిలో బ్యానర్స్ ప్రదర్శించి నీటి నిల్వలు తొలగించాలని , ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని దోమలను నిర్మూలించే విధంగా పగడ్బందిగా నిర్వహించాలన్నారు. వాడేసిన పాత టైర్స్, వాడేసిన కొబ్బరి బోండాలలో నీటి నిల్వ లేకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొనేలా అవగాహన కలిగించాలని సూచించారు . ప్రతి సంవత్సరం జూన్ నెల ఒకటో తేదీ నుండి నెలాఖరు వరకు మలేరియా పై ప్రజల్లో అవగాహన కల్గించి, ర్యాలీలు , సమావేశాలు నిర్వహించి, ఫ్లెక్సీ బ్యానర్ ప్రదర్శన, కరపత్రాల పంపిణీ ద్వారా అవగాహన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల సహకారంతో వైద్యశాఖ సంయుక్తంగా 2027 సంవత్సరం టార్గెట్ గా పెట్టుకొని మలేరియా మహమ్మారిని తరిమి ప్రజలందరూ సహకరించాలని ఆయన అన్నారు.

# కౌంటింగ్ సెంటర్ పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ మళ్ళింపు

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జిల్లా కేంద్రం కాకినాడలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం నుండిప్రారంభం కానున్నందునలెక్కింపుకేంద్రం జేఎన్టీయూకే పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్‌మళ్లింపుచేపట్టడం జరిగిందని కాకినాడఎస్డీపివో డా.కె.హనుమంత రావు అన్నారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో జరిగినవిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిఠాపురం వైపు నుంచి వచ్చే వాహనాలు తిమ్మాపురం వై.జంక్షన్ నుండి ఎడిబి రోడ్డుమీదుగాసామర్లకోట–కాకినాడరోడ్డుమీదుగా ఇంద్రపాలెంబ్రిడ్జి మీదుగా ప్రయాణించాలన్నారు. అమలాపురం నుండి వచ్చే వాహనాలు ఇదే రీతిలోరావాలన్నారు. భానుగుడి,ఎస్పీ కార్యాలయం సమీపంలోని అపార్ట్‌మెంట్ వాసులు రావ్ంకోసామీదుగామాత్రవేంఅనుమతితో ప్రయాణించాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులకు నిబంధనలు మేరకు సడలింపు ఉంటుందన్నారు. వారికి కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే వారి వాహనాలు పార్కింగ్ చేసుకోవాలన్నా రు. ఏజెంట్లు మంగళ వారం ఉదయం ఏడు గం టల లోపుగా కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని తర్వాత వచ్చినవారిని అనుమతించమని స్పష్టం చేశారు.



# ఎవరికి ఖేదం..ఎవరికి మోదం..!

**-కొద్ది గంటల్లోనే తేలనున్న భవితవ్యం**
**-ఎవరికి వారే గెలుపు ధీమా**
**-అంచనాలు వేయలేకపోతున్న విశ్లేషకులు**
**-భద్రతా బలగాల చేతుల్లో గోపాలపురం నియోజకవర్గం**
**-47 మందిపై బైండోవర్ కేసులు..**
**ఫలితాలు వచ్చే వరకు పోలీసు స్టేషన్లోనే**

**గోపాలపురం, మేజర్ న్యూస్ :** సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై తీవ్రమైన ఉత్కంఠ నెలకొంది. దాదాపు 20 రోజులకు పైగా వేచి చూచిన అభ్యర్థులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు ముఖ్యంగా ఓటర్లు చివరి గంటల్లో తీవ్ర ఉత్కంఠకు గురవుతున్నారు. నరాలు తెగేంత నిరీక్షణతో ఎదురుచూస్తున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు ఎవరికి ఖేదాన్ని..ఎవరికి మోదాన్ని మిగిల్చుతాయన్న విషయం పక్కన పెడితే.. ఓట్ల లెక్కింపు సమయం కోసం మాత్రం అత్యంత ఆత్రుతతో ఎదురుచూస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. అభ్యర్థులు మాత్రం గెలుపై ఎవరి దీమాలో వారున్నారు. ఇదిలా ఉంటే ఏ సర్వే సంస్థ కూడా కచ్చితంగా వీరే గెలుస్తారనే విషయాన్ని స్పష్టం చేయలేకపోయింది. మరోవైపు విశ్లేషకులు, పార్టీ సీనియర్లు కూడా కచ్చితమైన రిపోర్టును ఇవ్వలేకపోయారు. ఏదిఏమైనా మరో కొద్దిగంటల్లోనే ఉత్కంఠకు తెరపడే అవకాశం ఉంది. మంగళవారం ఉదయం 8గంటల నుంచే ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నట్లు ఇప్పటికే ఎన్నిక సంఘం ప్రకటించింది. మొదట పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు.

**-17రౌండ్లలో తేలనున్న ఫలితం**

గోపాలపురం నియోజకవర్గ ఫలితం కోసం సాయంత్రం




వరకు వేచిచూడాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే 17 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరిగిన తర్వాతే ఫలితం తేలనుంది. మొట్టమొదటిగా కొవ్వూరు ఫలితం తేలనుంది. 12 రౌండ్లలోనే కొవ్వూరు నియోజకవర్గ ఫలితం వెల్లడిరచనున్నట్లు అధికారులు ఇప్పటికే వెల్లడిరచారు. 19రౌండ్లతో పూర్తయ్యే రాజమహేంద్రవరం గ్రామీణ ఫలితం చివరిగా వస్తుంది. కొవ్వూరు 12 రౌండ్లు, నిడదవోలు 14 రౌండ్లు, రాజానగరం 15 రౌండ్లు, రాజమహేంద్రవరం సిటీ, అనపర్తి 16 రౌండ్లు, గోపాలపురం 17 రౌండ్లు, రాజమహేంద్రవరం గ్రామీణం 19 రౌండ్లలో ఫలితాన్ని వెల్లడిరచనున్నారు.

**-2019లో 37,461మెజార్టీ.. మరి ఈ సారి..?**

తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న గోపాలపురం నియోజకవర్గం, 2019లో ఫ్యాన్ ప్రబంజనంతో కంచుకోటకు బీటలు వాలాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా తెలుగుదేశం అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుపై వైసీపీ అభ్యర్థి తలారి వెంకటరావు 37,461 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అనపర్తి అభ్యర్థి సత్తి సూర్యనారాయణ రెడ్డి 55,207 ఓట్ల మెజార్టీతో గెలుపొందితే రెండోస్థానంలో తలారి వెంకట్రావు గెలుపొందారు. అయితే ఈ సారి వైసీపీ ఆ స్థానం నిలబెట్టుకుంటుందా.. లేదా మళ్లీ తెదేపాకు అవకాశం ఇస్తుందా అన్నది వేచిచూడాల్సి ఉంది. రాజమహేద్రవరం పార్లమెంట్ సిగ్మెంట్‌లో 7 నియోజకవర్గాలు ఉంటే రాజమహేంద్రవరం సిటీ, రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గంలో తెదేపా గెలుపొందగా మిగిలిన 5 స్థానాల్లో వైసీపీ గెలిచింది.

**-47 మందిపై బైండోవర్ కేసులు**

గోపాలపురం నియోజవర్గ పరిధిలో 47 మందిపై బైండోవర్ కేసులు పెట్టినట్లు పోలీసులు తెలిపారు. వీరంతా ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు స్టేషన్లలోనే ఉంటారని చెప్పారు. అంతేకాదు కొన్ని సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోపాలపురం మండలంలో జగన్నాథపురం, భీమోలు, హుకుంపేట, దొండపూడి ప్రాంతాల్లో..దేవరపల్లి మండలంలోని దేవరపల్లి, యాదవోలు, యర్నగూడెం, త్యాజంపూడి, పల్లంట్ల గ్రామాల్లో, నల్లజర్ల మండలంలోని నల్లజర్ల, చోడవరం, తెలికిచర్ల, అనంతపల్లి, జగన్నాథపురం, ప్రకాశరావుపాలెం, దూబచర్ల గ్రామాల్లో పికెట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి మండలంలోనూ అవసరాన్ని బట్టి 60 నుంచి 80 మంది పోలీసు బలగాలను నియమిస్తున్నట్లు చెప్పారు. లెక్కింపు అయ్యేంత వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఎక్కడ్కైనా..ఎవరైనా అవాంచనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లెక్కింపు పూర్తయ్యే వరకు మద్యం దుకాణాలు మూసి వేస్తామని తెలిపారు.

# కౌంటింగ్ ప్రక్రియ సర్వం సిద్ధం

**-కౌంటింగ్ సన్నద్ధంపై నలుగురు ఎన్నికల పరిశీలకుల ఆధ్వర్యంలో సమీక్ష**
**-కలెక్టర్ / జిల్లా ఎన్నికల అధికారి డా. కే. మాధవీలత**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** సార్వత్రిక ఎన్నికలు – 2024 కౌంటింగ్ ఏర్పాట్లు విజయవంతంగా నిర్వహించేందుకు రిటర్నింగ్ అధికారులు పూర్తి స్థాయిలో సిద్ధంగా వున్నామని కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా.కే.మాధవీలత పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలు – 2024 భాగంగా నన్నయ్య యూనివర్సిటీ లో కౌంటింగ్ ఏర్పాట్లు, ఎన్నికల ఓట్ల లెక్కింపుఏర్పాట్లుపై కౌంటింగ్ పరిశీలకులు రిటర్నింగ్ అధికారులతో అంశాల వారిగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.మాధవీలతమాట్లాడుతూ జూన్ 4వ తేదీ మంగళవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం రిటర్నింగ్ అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల కమీషన్ నియమ నిబంధనలు,మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటిస్తూ నన్నయ్య యూనివర్సిటీ ఏర్పాటు చేసిన పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 17 కౌంటింగ్ కేంద్రాల వద్ద అత్యంత పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, 160 పైగా సీసీ కెమెరాల ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత చేపట్టాల్సిన నివేదికలు పంపడం తదితరకార్యకలాపాలపైఅన్నిచర్యలు తీసుకున్నామన్నారు.సజావుగాకౌంటింగ్ ప్రక్రియను చేపట్టేందుకు సంసిద్ధంగా చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ ప్రకారం నడుచుకోవాలని రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు, ఏజెంట్స్ స్పష్టం చేశామన్నారు.కౌంటింగ్ కోసం అభ్యర్థులు, ఏజెంట్లకు సుమారు 2500ఐడికార్డులు జారీ చేశామన్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని వివరించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ పరిశీలకులు కే.బాల సుబ్రహ్మణ్యం,కమల్‌కాంత్ సరోఛ,బీజై కుమార్ కందయాత్ రాయ్, టాన్‌సింగ్ జి. మోమిన్ లు వారికీ సంబంధించిన నియోజక వర్గాల వారీగా సమీక్ష నిర్వహించి, తగిన సూచనలు చెయ్యడం జరిగింది. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు విషయంలో ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ప్రణాళికా బద్ధంగా అడుగులు వెయ్యాలన్నారు.

**-తూర్పు గోదావరి జిల్లాలో 17 కౌంటింగ్ కేంద్రాల వివరాలు:**

అనపర్తి అసెంబ్లి నియోజక వర్గం పరిధిలో ఈవిఎమ్ ద్వారా పోలైన ఓట్లు “ఎన్ బ్లాక్”లో పార్లమెంటు సిగ్మెంట్ ఈవిఎమ్ ఓట్లు రూం నెంబర్ 215 & 216 (14 టేబుల్స్), అసెంబ్లి సిగ్మెంట్ ఈవిఎమ్ ఓట్లు 218 & 218 ఏ (14 టేబుల్స్) , పోస్టల్ బ్యాలెట్ ఓట్లు (2 టేబుల్స్)..రాజానగరంఅసెంబ్లి నియోజక వర్గం పరిధిలో ఈవిఎమ్ ద్వారా పోలైన ఓట్లు “ఇంజనీరింగ్ వర్క్ షాప్ భవనం దిగువ అంతస్తు” లో పార్లమెంటు సిగ్మెంట్ ఈవిఎమ్ ఓట్లు (14 టేబుల్స్) , అసెంబ్లి సిగ్మెంట్ మొదటి అంతస్తులో ఈవిఎమ్ ఓట్లు (14 టేబుల్స్),పోస్టల్‌బ్యాలెట్‌ఓట్లుమొదటిఅంతస్తులో4 టేబుల్స్.. రాజమండ్రి సిటీ అసెంబ్లి నియోజక వర్గం పరిధిలో ఈవిఎమ్ ద్వారా పోలైన ఓట్లు “ఎన్ బ్లాక్–ఈస్ట్ వింగ్”లో పార్లమెంటు సిగ్మెంట్ ఈవిఎమ్ ఓట్లు రూం నెంబర్ 317(14టేబుల్స్), అసెంబ్లి సిగ్మెంట్ ఈవిఎమ్ ఓట్లు రూమ్ నంబర్ 320, 321 లలో (14 టేబుల్స్)పోస్టల్‌బ్యాలెట్‌ఓట్లురూమ్ 319లో (6 టేబుల్స్)రాజమండ్రి రూరల్ అసెంబ్లి నియోజక వర్గం పరిధిలో ఈవిఎమ్ ద్వారా పోలైన ఓట్లు “ఎన్ బ్లాక్” లో పార్లమెంటు సిగ్మెంట్ ఈవిఎమ్ ఓట్లు రూం నెంబర్ 119 (14 టేబుల్స్) , అసెంబ్లి సిగ్మెంట్ ఈవిఎమ్ ఓట్లు 111 & 112 రూమ్స్ లో (14 టేబుల్స్ ) , పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 113 రూమ్ లో(5 టేబుల్స్)కొవ్వూరు (ఎస్సి) అసెంబ్లి నియోజక వర్గం పరిధిలో ఈవిఎమ్ ద్వారా పోలైన ఓట్లు “ఎన్ బ్లాక్ 2వ అంతస్తు” లో పార్లమెంటు సిగ్మెంట్ ఈవిఎమ్ ఓట్లు రూం నెంబర్ 314 లో (14 టేబుల్స్) ,అసెంబ్లి సిగ్మెంట్ రూమ్స్ 315,316లలో ఈవిఎమ్ ఓట్లు(14టేబుల్స్),పోస్టల్‌బ్యాలెట్ ఓట్లు(4 టేబుల్స్)

నిడదవోలు అసెంబ్లి నియోజక వర్గం పరిధిలో ఈవిఎమ్ ద్వారా పోలైన ఓట్లు “ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్ దిగువ అంతస్తు” లో పార్లమెంటు సిగ్మెంట్ ఈవిఎమ్ ఓట్లు రూం నెంబర్ సి సి 101 /ఏ లో (14 టేబుల్స్ ) , అసెంబ్లి సిగ్మెంట్ రూములలో ఈవిఎమ్ ఓట్లు సీసీ 108/ఏ (14 టేబుల్స్), పోస్టల్ బ్యాలెట్ ఓట్లు(3 టేబుల్స్) గోపాలపురం అసెంబ్లి నియోజక వర్గం పరిధిలో ఈవిఎమ్ ద్వారా పోలైన ఓట్లు “ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్ మొదటి అంతస్తు” లో పార్లమెంటు సిగ్మెంట్ ఈవిఎమ్ ఓట్లు ఉత్తరం వైపు కాన్ఫరెన్స్ హాలులో (14 టేబుల్స్),అసెంబ్లి సిగ్మెంట్ దక్షిణం వైపు కాన్ఫరెన్స్ హాలులో ఈవిఎమ్ ఓట్లు (14 టేబుల్స్), పోస్టల్ బ్యాలెట్ ఓట్లు(2 టేబుల్స్)

## సామర్లకోటలో 2 పీకెట్‌లు, 4 మొబైల్ టీములు సిద్ధం



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా పెద్దాపురం నియోజక వర్గంలోని సామర్లకోట పట్టణంలో 4వ తేదీ మంగళవారం సుమారు యాభై మంది సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నట్టు సామర్లకోట సిఐ సురేష్ చెప్పారు. సోమవారం రాత్రి ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉన్నట్టు చెప్పారు. ఆ నేపథ్యంలో పట్టణంలో రాజకీయ పార్టీల మధ్య ఎలాంటి అల్లర్లు చోటు చేసుకోకుండా ఉండేందుకు గానూ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన చెప్పారు. పట్టణంలో రెండు పికెట్ లు, నాలుగు మొబైల్ టీమ్ లు, ఒక క్యూ ఆర్పీ టీమ్ అందుబాటులో ఏర్పాటు చేసామన్నారు. ఉదయం ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తరువాత అవసరాన్ని గుర్తించి ప్రత్యేక పికెట్ లో ఏర్పాటు చెయ్యనున్నట్టు చెప్పారు. ఇంకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సామర్లకోట పట్టణం తో పాటు గ్రామాల్లోనూ శాంతిభద్రతల పరిరక్షణకు నాలుగు మొబైల్ టీములు ద్వారా పెట్రోలింగ్ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇంకా ఒక క్యూ ఆర్పీ టీమ్ ను కూడా అందుబాటులో ఉంచి అత్యవసర పరిస్థితుల్లో వినియోగించ నున్నట్టు ఆయన చెప్పారు. ఓట్ల లెక్కింపు కారణంగా పోలీస్ స్టేషన్ పరిధిలో 144 సెక్షన్ ను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నందున ప్రజలు, పార్టీల నాయకులు, అభిమానులు గుంపులుగా ఉండకుండా ప్రశాంతా వాతావరణంలో ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి సహకరించాలని ఎమ్మెల్యే అభ్యర్థులు ఎవరు గెలిచినా వైషమ్యాలకు పోకుండా సహనాన్ని పాటించాలని, లెక్కింపు అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీ లు నిర్వహించ రాదని సిఐ హెచ్చరించారు. ఈ నిబంధనలు మీరిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు, పార్టీల నాయకులు జాగ్రత్త వహించాలని ఆయన తెలిపారు.

## ఆటలు వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు

**నరసాపురం,మేజర్ న్యూస్ :** ఆటలు ఆడటం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, వాటితో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ కానూరి బుజ్జి అన్నారు. గత 10 రోజులుగా టైలర్ హై స్కూల్ గ్రౌండ్ నందు చిక్కాల చంద్రశేఖర్, అంజూరి నాని స్మారక టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నారు. సోమవారం బహుమతుల ప్రధానోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనస్మారక కానూరి బుజ్జి మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల కాలంలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వటం లేదని, ఆటలు ఆడుకునేందుకు స్త లాలను కూడా కేటాయించడం లేదని ఇప్పటికైనా ప్రభుత్వం క్రీడాకారులకు ఆట స్థలం కేటాయించాలని కోరారు. జనసేన నాయకులు వర్ధన్నప్రసాద్,రౌతుల శ్రీనివాస్, నరేష్, సచ్చింబాబు,బాబి ఆర్గనైజింగ్ కమిటీ గంటా మధు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. విన్నర్స్ గా మహేష్ లెవెన్ శ్రీహరి పేట, గంధం కిషోర్ 11 గ్రౌండ్ యూత్,స్పాన్సర్స్‌గా అవినాష్, నరేష్ రామవరపు శ్రీరామ్, అడ్డాల రమేష్, మేడిశెట్టి బాలు తదితరులు పాల్గొన్నారు.

## కోడి పందాల శిబిరంపై దాడి 15 మందిపై కేసు యమోదు

**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.రాజశేఖర్‌కు అందిన సమాచారం మేరకు ఏలూరు వన్ టౌన్ ఎస్ఐ నవీన్,సిబ్బందితో ఉదయం 6గంటలకు కోడిపందాల శిబిరంపై దాడి చేశారు. పోణంగిలో ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ దగ్గరలో జరుగుచున్న కోడిపందాలపై దాడి చేసి 15 మంది వ్యక్తులను,రూ.30వేల నగదు, ఒక కోడి,15 బైకులు స్వాధీనం చేసుకుని కేసు రిజిస్టర్ చేశారు.

# కౌంటింగ్ నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

**- ప్రజలు సహకరించాలని కోరిన జిల్లా ఎస్పీ**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా పరిధిలోని కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం మరియు కాకినాడ జిల్లాలోని గల 7-అసెంబ్లీ నియోజకవర్గములకు సంబంధించి సార్వత్రిక ఎన్నికలు-2024 ఓట్ల లెక్కింపు కాకినాడ జెఎన్టీయు క్యాంపస్ మరియు జెఎన్టీయు స్టేడియం నందు జరుగు సందర్భంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణను 4వ తేదీ మంగళవారం తెల్లవారుజామున 4.00 గంటల నుండి కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేవరకు ఈ క్రింది విధంగా ట్రాఫిక్‌ను మళ్ళించడమైనదని, కావున ప్రజలు సహకరించవలసింది గా జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కోరారు.

1)పిఠాపురం నుండి కాకినాడ, అమలాపురం, రామచంద్రాపురం, పెదపూడి వైపు వెళ్ళవలసిన వాహనములను ఈ క్రింది మార్గములో మళ్ళించడమైనది.

పిఠాపురం, చిత్రాడ నుండి తిమ్మాపురం వై-జంక్షన్ వద్ద కుడి వైపునకు తీసుకొని కొత్తగా వేసిన బై-పాస్ మార్గము ద్వారా వెళ్లి ఎడిబి రోడ్‌లోకి ప్రవేశించి, కొప్పవరం జంక్షన్ నుండి కుడి వైపునకు తీసుకుని, ఉండూరు బ్రిడ్జి మీదగా సామర్లకోట వెళ్ళువారు కుడివైపునకు, ఇంద్రపాలెం వెళ్ళువారు ఎడమ వైపు వెళ్ళవలెను.

కాకినాడ పట్టణంలోకి వెళ్ళవలసినవారు ఉండూరు బ్రిడ్జి వద్ద ఎడమ వైపునకు తీసుకుని కెనాల్ రోడ్ మీదుగా మాధవపట్నం-ప్రతాప్ నగర్ బ్రిడ్జి-ఇంద్రపాలెం బ్రిడ్జి వద్ద ఎడమ వైపు తీసుకుని వారి గమ్యములకు చేరవలెను. పెదపూడి, రామచంద్రాపురం, యానాం మరియు అమలాపురం వెళ్ళవలసిన వాహనదారులు పై మార్గములో వచ్చి ఇంద్రపాలెం బ్రిడ్జి నుండి కుడి వైపునకు తీసుకుని చీడిగ కొత్త బై-పాస్ మీదుగా నేరుగా పెదపూడి వైపు వెళ్ళవలెను. రామచంద్రాపురం మరియు ద్రాక్షారామ వైపునకు వెళ్ళవలసిన వాహనదారులు పై మార్గము ద్వారా వచ్చి చీడిగ కొత్తగా నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద ఎడమ వైపునకు తీసుకుని బై-పాస్ మీదగా (ఎన్‌హెచ్-216) తురంగి బ్రిడ్జి వద్ద కుడి వైపునకు తీసుకుని రామచంద్రాపురం మరియు ద్రాక్షారామ వైపు వెళ్ళవచ్చును. తాళ్ళరేవు, యానాం మరియు అమలాపురం వెళ్ళవలసిన వాహనదారులు పై మార్గము ద్వారా వచ్చి తురంగి బ్రిడ్జి నుండి నేరుగా ఉప్పలంక వై-జంక్షన్ మీదగ యానాం మరియు అమలాపురం వెళ్ళ వచ్చును. 2)కాకినాడ, సామర్లకోట, పిఠాపురం, తుని, విశాఖపట్నం వైపు వెళ్ళవలసిన వాహనదారులు ఈ క్రింది మార్గములలో మళ్ళించడమైనది అమలాపురం మరియు యానాం మీదుగా వచ్చు వాహనదారులు ఉప్పలంక వై-జంక్షన్ వద్ద నుండి ఎడమ వైపునకు తీసుకుని తూరంగి బ్రిడ్జి మీదగా చీడిగ బ్రిడ్జి వద్దకు చేరుకొని కుడి వైపునకు తీసుకుని ఇంద్రపాలెం బ్రిడ్జి మీదుగా ఎడమ వైపునకు తీసుకుని కెనాల్ రోడ్ లో సామర్లకోట వెళ్ళవచ్చును, అదే విధముగా ఇంద్రపాలెం బ్రిడ్జి వద్దనుండి కుడి పైపునకు తీసుకోని కాకినాడ నగరంలోకి ప్రవేశించవచ్చును.

పిఠాపురం వెళ్ళవలసిన వాహనదారులు సామర్లకోట మీదుగా గాని లేక కెనాల్ రోడ్‌లో గల ఉండూరు బ్రిడ్జి వద్దకు చేరుకొని అక్కడ నుండి కుడి వైపునకు తీసుకుని ఎడిబి రోడ్‌లో గల కొప్పవరం జంక్షన్ వద్ద కొత్తగా నిర్మాణంలో ఉన్న (ఎన్‌హెచ్-216) బ్రిడ్జి వద్ద ఎడమ వైపునకు తీసుకుని తిమ్మాపురం వై-జంక్షన్ నుండి పిఠాపురం వైపు వెళ్ళవచ్చును.

3)కాకినాడ పట్టణం నుండి సామర్లకోట, పిఠాపురం వెళ్ళవలసిన వాహనదారులు ఈ ఈ క్రింది మార్గముల లో మళ్ళించడమైనది.

భానుగుడి జంక్షన్ నుంచి ముత్తాగోపాలకృష్ణ బ్రిడ్జి మీదుగా శారదదేవి గుడి-కర్ణంగారి జంక్షన్ నుండి కుడి వైపునకు తీసుకుని ఎస్.వి. రంగారావు విగ్రహం -గైగాలపాడు జంక్షన్ - సర్పవరం పూల మార్కెట్ మీదుగా మాధవపట్నం సెంటర్-కెనాల్ రోడ్ మీదగా సామర్లకోట మరియు పిఠాపురం వెళ్ళవచ్చును. అదేవిధముగా సర్పవరం పూల మార్కెట్ నుండి పనసపాడు మీదుగా ఎడిబి రోడ్‌లోకి ప్రవేశించి కొప్పవరం జంక్షన్ వద్ద కొత్తగా నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద నుండి కుడి వైపునకు తీసుకుని తిమ్మాపురం వై-జంక్షన్ మీదుగా పిఠాపురం వైపు వెళ్ళవచ్చును.

4)కాకినాడ పట్టణంలోని పోర్ట్ మరియు ఇతర ప్రాంతాలకి వెళ్ళు భారీ వాహనాలను కాకినాడ పట్టణం లోకి ప్రవేశించకుండా నిలుపుదల చేయు ప్రదేశములు (కట్ ఆఫ్ పాయింట్లు).

1.రాజానగరం నుండి సామర్లకోట వరకు గల ఎడిబి రోడ్‌లో భారీ వాహనాలను కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేవరకు నిలుపుదల చేసుకోవలెను. 2.కత్తిపూడి ఎన్‌హెచ్ -16 బ్రిడ్జి వద్ద నుండి కాకినాడ పోర్ట్ కి వచ్చు భారి వాహనములు కత్తిపూడి జంక్షన్ వద్ద ఎన్‌హెచ్-16 పై నిలుపుదల చేయవలెను.

3.లైట్ హౌస్ (సూర్యారావుపేట జంక్షన్ వద్ద) : ఉప్పడ బీచ్ రోడ్ నుండి వచ్చు భారీ వాహనములను సూర్యారావుపేట జంక్షన్ వద్ద నిలుపుదల చేయవలెను. 4.ఉప్పలంక వై-జంక్షన్ (ఎన్‌హెచ్-216) : యానాం నుండి కాకినాడ పోర్ట్ వైపునకు వెళ్ళు భారీ వాహనములను ఉప్పలంక వై-జంక్షన్ (ఎన్‌హెచ్-216) ముందే నిలుపుదల చేయవలెను.

5.ఉప్పాడ వైపునుండి కాకినాడ నగరంలోకి వచ్చు భారీ వాహనాలు ఉప్పాడ కు ముందున నిలుపుదల చేయాలి.

**నిషిద్ధ ప్రదేశములు :** కాకినాడ మరియు చుట్టూ ప్రక్కల ప్రదేశాల నుండి వచ్చు ప్రజలు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబందించని వాహనదారులకు ఈ క్రింది ప్రదేశాలలో ప్రవేశం నిషేడించడమైనది.

1)ఆశ్రమం పబ్లిక్ స్కూల్- నాగమల్లి తోట జంక్షన్ - వినాయక కేఫ్ - అమ్మవారి టెంపుల్ - డిఎస్ఎ స్పోర్ట్స్ గ్రౌండ్ - ఆర్టీవో ఆఫీస్ జంక్షన్ - కమ్మ కళ్యాణమండపం సెంటర్ నుండి రామకోసా జంక్షన్ - మెన్స్ హాస్టల్ సెంటర్ - ఫారెస్ట్ ఆఫీస్ రోడ్ (కలెక్టర్ గారి బంగ్లా రోడ్) - ఎ.ఆర్. లైన్స్, భానుగుడి జంక్షన్, ఓల్డ్ డిపివో - గవర్నమెంట్ ఐటిఐ - ఎక్సిబిషన్ గ్రౌండ్ మరియు జెఎన్టీయు క్యాంపస్ చుట్టూ మధ్యలో ఉన్న ప్రదేశాలలో వాహనదారులు మరియు ప్రజలు ప్రవేశించడంపై నిషిద్ధ ఆంక్షలు ఉన్నవి కావున గమనించగలరు. పై ప్రదేశములలో నివసించే ప్రజలు వారు వ్యక్తిగత పనులకు రాకపోకలు రామకోస జంక్షన్ వద్ద నుండి మాత్రమే అనుమతించబడును.

వాహనదారులు జెఎన్టీయుకె పరిసర ప్రాంతాలకు రాకుండా ఈ క్రింది జంక్షన్‌ల వద్ద నుండి ట్రాఫిక్ మళ్ళించడమైనది.

1.అచ్చంపేట జంక్షన్-సర్పవరం జంక్షన్ - గంగరాజునగర్ టి.జంక్షన్-ఆర్టీవో ఆఫీస్‌జంక్షన్ - అంబేద్కర్ విగ్రహం (గుడారిగుంట) - మదర్ తెరిస్సా విగ్రహం - కోకిల సెంటర్. 2.భానుగుడి జంక్షన్ - కర్ణం గారి జంక్షన్ - ఎస్.వి. రంగారావు జంక్షన్ - గైగాలపాడు జంక్షన్ - సర్పవరం పూల మార్కెట్ - మాధవపట్నం జంక్షన్.

**గమనిక :** 1.ఎలెక్షన్ కౌంటింగ్ నకు హాజరగు పోటీ చేసిన అభ్యర్థులు మరియు వారి యొక్క ఏజెంట్లకు పై ట్రాఫిక్ నిబంధన యందు సడలింపు కలదు. వారి యొక్క వాహనములను పెద్దాపురం నియోజకవర్గం మినహా మిగిలిన ఆరు నియోజకవర్గంలలో అనగా కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం మరియు తుని కు సంబంధించిన అభ్యర్థులు మరియు ఏజెంట్లు వారి వాహనములను జేఎన్టీయూకు ఎదురుగా గల ఎగ్జిబిషన్ గ్రౌండ్ మరియు ఐటిఐ కాలేజ్ గ్రౌండ్ నందు వారి వాహనములకు పార్కింగ్ గా ఇవ్వడం అయినది. పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థులు మరియు వారి యొక్క ఏజెంట్లకు స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్ నందు పార్కింగ్ గా నిర్ధారించడమైనది. 2.ఎలక్షన్ కౌంటింగ్ హాజరగు కౌంటింగ్ ఏజెంట్లను ఉదయం ఏడు గంటలు దాటిన తర్వాత కౌంటింగ్ హాల్ నందు అనుమతించబడదు. కావున ఉదయం 7 గంటల లోపు నే జేఎన్టీయూ కౌంటింగ్ సెంటర్ కు చేరుకుని లోపలికి ప్రవేశించవలెను.

3. కౌంటింగ్ ప్రక్రియకు ఎలక్షన్ కమిషన్ చే అనుమతిగల వ్యక్తులకు మాత్రమే లోపలకు ప్రవేశం కలదు. మరి ఏ ఇతర వ్యక్తులకు లోపలకు ప్రవేశము నిషేధము. అట్టి వ్యక్తులను ఎవరిని అనుమతి గల వ్యక్తులు వారితోపాటుగా తీసుకుని రాకూడదు.

ముఖ్య గమనిక : కౌంటింగ్ ప్రక్రియకు హాజరగు కౌంటింగ్ ఏజెంట్లు మరియు అభ్యర్థులకు కౌంటింగ్ హాలులో ప్రవేశించక ముందు వారికి బ్రీత్ అనలైజర్ తో ఆల్కహాల్ మరియు డ్రగ్ టెస్టులు చేయబడును. ఎవరైనా మద్యం సేవించి లేదా ఏదైనా ఇతర నిషేధిత డ్రగ్ తీసుకుని కౌంటింగ్ ప్రాంతానికి వచ్చిన వారిని కౌంటింగ్ హాలులోనికి అనుమతించబడదని సూపరింటెండెంట్ అఫ్ పోలీస్, కాకినాడ జిల్లా, కాకినాడ వారు తెలియజేశారు.

## నేడు ఏలూరులో ట్రాఫిక్ మళ్లింపు..జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి

**ఏలూరు,మేజర్‌న్యూస్:** నేడు 4 తేదీ మంగళవారం జరగబోవు సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఏలూరులోని సీ.ఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళశాల వద్ద భద్రత కట్టుదిట్టం చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. 144 సీ.ఆర్.పీసీ సెక్షన్, 30 పోలీసు యాక్టు అమల్లో ఉన్నందున ఓట్ల లెక్కింపు సిబ్బంది, బందోబస్తు పోలీసు సిబ్బంది, పోటీలో ఉన్న అభ్యర్థులు, పోలింగు ఏజెంట్లు మినహా రాజకీయ పార్టీలకు సంబంధించిన వ్యక్తులు పోలింగు కేంద్రము నకు రెండు కిలో మీటర్ల పరిసర ప్రాంతాలలో సంచరించరాదని ఎస్పీ పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రం పరిసరాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించడం జరుగుతుందన్నారు.

## నేటి కౌంటింగ్ నేపథ్యంలో బందోబస్తు రిహార్సల్

**ఏలూరు,మేజర్ న్యూస్:** 4వ తేదీన నిర్వహించే కౌంటింగ్ నేపథ్యంలో సిబ్బందికి బందోబస్తులో నిర్ణయించిన ప్రదేశాలలో విధి నిర్వహణ ఎలా చేయాలి అనే విషయాలపై దశ దిశ నిర్దేశించి తగిన సూచనలు,సలహాలు జిల్లా ఎస్పీడి.మేరిప్రశాంతి ఇచ్చారు. కౌంటింగ్ కొరకు ఏర్పాటు చేయబడిన బందోబస్తు రిహార్సల్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన జిల్లా ఎస్పీ ,అభ్యర్థులను అధికారులను కౌంటింగ్ ఏజెంట్లను ఏవిధంగా తనిఖీలు నిర్వహించాలి యూ పద్ధతుల్లో ఎవరెవరిని ఎలా పంపించాలి అనే విషయాలపై సిబ్బందికి తగిన ఆదేశాలు జిల్లాఎస్పీ ఇచ్చారు. జిల్లాఎస్పీతో పాటుగా అవినీతి నిరోధక శాఖ జె.డిసుప్రజా,అదనపు ఎస్పీ అడ్మిన్ జి స్వరూప రాణ,డీఎస్పీలు ప్రభాకర్ రావు, ఈ శ్రీనివాసులు లక్ష్మయ్య సురేష్ కుమార్ రెడ్డి, ఎస్.బి ఇన్స్పెక్టర్లు మల్లేశ్వరరావు,ఆది ప్రసాద్, ఎస్ఐలు ,సిఐలు పాల్గొన్నారు.

## సమాజ సేవలో పునరంకితమైన ఆముదాల కుటుంబం

**ముసునూరు,మేజర్ న్యూస్:** ముసునూరు మండలం రమణక్కపేట గ్రామంలో సోమవారం సిపిఐ నేత ఆముదాల తిరుపతయ్య తృతీయ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ లిబరేషన్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి హరినాథ్ మాట్లాడుతూ సామాజిక సేవలో ఆముదాల తిరుపతయ్య కుటుంబం అంకితమయ్యిందన్నారు. చదువు, పోరాడు నినాదంతో కమ్యూనిస్టువాదిగా నిత్య పోరాటం చేసిన తిరుపతయ్య కుటుంబం ఆదర్శనీయమన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, సిపిఐ నూజివీడు ఏరియా కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు కూచిపూడి నాగేశ్వరరావు, ఏఐసిటియు జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి ములుగు శ్యాము మోహన్, కామ్రేడ్ తిరుపతయ్య కుమారుడు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఆముదాల కాంతారావు, తిరుపతయ్య కుమార్తె, బాపులపాడు మండలం కొత్తపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బొకినాల కాంత కుమారి లు తిరుపతయ్యకు ఘన నివాళి అర్పించారు.